క్లుప్తంగా

శుభకార్యం



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్నారెడ్డి మనుమరాలు రష్మిత, కార్తీక్‌రెడ్డి వివాహానికి ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. అలాగే గౌరాజుపల్లికి చెందిన తిమ్మారెడ్డి కుమారుడి కేశఖండన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ శ్రీరామప్ప ఇటీవలే హిందూపురంలోని ఓ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే శంకర నారాయణ ఆస్పత్రికి వెళ్లి శ్రీరామప్పను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని హొన్నంపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందరెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరయ్యారు. గోవిందరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

షిర్డీసాయి గుడికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళ మొత్తం అందజేస్తున్న పోతుల రామకృష్ణారెడ్డి

గోరంట్ల: స్థానిక వినాయకనగర్‌లో వెలసిన షిర్డీసాయిబాబా గుడి అభివృద్ధికి మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ బాలన్నగారిపల్లి పోతుల రామకృష్ణారెడ్డి 25,021 విరాళం ప్రకటించారు. విరాళ మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చలివేందుల సర్పంచ్ లక్ష్మినారాయణరెడ్డి , ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండలరలోని మల్లాపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి, బూగనిపల్లి, మోట్రపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్



కల్లుకుంటలో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

చిలమత్తూరు: మండలంలోని పలగలపల్లి పంచాయతీలోని బందేపల్లి, కల్లుకుంట గ్రామాల్లో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి కర్ణాటక మద్యం, గుట్కా వంటివి విక్రయిస్తున్నారన్న సమాచారంతో అనుమానితుల దుకాణాల్లో తనిఖీ చేశారు. అలాగే గ్రామ సభ నిర్వహించి ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని, గొడవల జోలికి వెళ్లవద్దని సూచించారు. పేకాట, కర్ణాటక మద్యం వంటి వాటిపై సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రవికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలి ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నక్కలగుట్ట వద్ద ఇసుకలోడుతో వెళుతున్న ఎద్దు హఠాత్తుగా కుప్పకూలి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పందిపర్తికి చెందిన నజ్జప్ప తన ఎద్దుల బండిలో ఇసుక తీసుకుని సోమందేపల్లికు వస్తుండగా మార్గమధ్యంలో ఎద్దు కుప్పకూలిందని, దీంతో రూ.1.లక్ష దాకా నష్టం వాటిల్లిందని బాధుతుడు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తిపై దాడి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బ్రాందీ షాపులో పనిచేస్తున్న వాచ్‌మెన్ రామాంజిపై నలుగురు వ్యక్తులు దాడిచేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాపులో మద్యం తాగవద్దని చెప్పడంతో శనివారం రాత్రి దాడి చేసి గాయపరిచారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

జగనన్నకే మా మద్దతు

- సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయి
- 'గడప గడపకూ'లో లబ్ధిదారుల హర్షం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు లక్ష్మీనరసప్ప. వీరిది మడకశిర మండలం కరేసంగనహళ్లి. లక్ష్మీనరసప్ప కుటుంబానికి వైఎస్సార్ చేయూత కింద రూ.37,500, ఆసరా ద్వారా రూ.10,786, జగనన్న వసతి దీవెన కింద రూ.15,825, పింఛన్ కానుక ద్వారా రూ.1,08,000, రైతు భరోసా కింద రూ.40,500, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.31,381, సున్నా వడ్డీ(డ్వాక్రా) కింద రూ.4,281 చొప్పున మొత్తం రూ.2,48,273 లబ్ధి పొందింది. సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటామని, ఆయన మేలును ఎప్పటికీ మరిచి పోలేమని, మళ్లీ జగనన్ననే సీఎంగా చేసుకొంటామని లక్ష్మీనరసప్ప తెలిపారు.



బుడ్డయ్యపాళ్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం. మరోసారి ఆయనను ఆశీర్వదించి జగనన్నను సీఎంగా చేసుకోంటాము' అని లబ్ధిదారులు, మహిళలు తెలిపారు. వైబీహళ్లి గ్రామ సచివాలయం పరిధిలోని కరేసంగనహళ్లి, బుడ్డయ్యపాళ్యం గ్రామాల్లో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి పొందిన పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. జగన్ ప్రభుత్వంలో మూడు, నాలుగు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందామని లబ్ధిదారులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ కుటుంబానికి కొండంత భరోసా కల్పించాయని ఎమ్మెల్యేకు వివరించారు. సచివాలయం పరిధిలో పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులకు సూచించారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

జగనన్నకు అండగా ఉండాలి

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 96 శాతం అమలు చేసి ప్రతి ఇంటికీ లబ్ధిని చేకూర్చారని తెలిపారు. మరోసారి జగన్‌ను ఆశీర్వదించి సీఎంగా చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రొత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి మంజునాథ్, పంచాయితీ కన్వీనర్ బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, వివిధ కమిటీల నాయకులు నాగభూషణరెడ్డి, వెంకటేష్, పాండు, రాజేష్, నాగేంద్రకుమార్, మంజునాథ్, రంగనాథ్, ముద్దప్ప, దొడ్డయ్య , విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి మూర్తి, కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్ ' వందశాతం పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్‌కు బాట వేస్తుండటంతో ప్రజలందరూ జగనన్నకు మద్దతుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం వైబీహళ్లి పంచాయతీలోని బుడ్డయ్యపాళ్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వారి అనుమతితో ఇంటి తలుపులకు జగనన్నే మా నమ్మకం ఫొటో స్టిక్కర్లను అతికించారు. ఐదు ప్రశ్నలు అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 29 లోపు వంద శాతం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కన్వీనర్లు, గృహసారథులకు సూచించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండల పరిధిలోని బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన రంగనాథ్ కాంగ్రెస్ పార్టీని వీడి ఆదివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో అనుచరులతో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలోకి చేరామన్నారు.

ఉష్ణోగ్రత సమాచారం
(గరిష్ఠం)
హిందూపురం : 37.0
పెనుకొండ : 39.0
మడకశిర : 37.0

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్‌కాలనీలో దండు మారెమ్మ ఆలయ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ కేశవ మూర్తి ఆదివారం భూమి పూజ చేసారు. ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, గ్రామ పెద్దలు రామచంద్రప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మడకశిర: మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. శాఖల వారీగా అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

'మలేరియా'పై ర్యాలీ రేపు

రొళ్ల: మండల కేంద్రంలో సీహెచ్‌సీ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు.

ఘనంగా బసవ జయంతి

హిందూపురం టౌన్: భగవంతుడు నిరాకారుడని, అందుకే వీరశైవులు శివ లింగాన్ని పూజిస్తారని పెనుకొండ కోన ఆశ్రమం పీఠాధిపతి దత్తానందగిరి స్వామి అన్నారు. ఆదివారం బసవ జయంతిని పురస్కరించుకుని స్థానిక వాసవీ ధర్మశాలలో బసవ జయంతి వేడుకలను వీరశైవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు మాజీ మర్కెట్ యార్డ్ చైర్మన్ కొండూరు మల్లికార్జున రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. సాయంత్రం బసవేశ్వరుడు చిత్రపటాన్ని పల్లకీపై ఊరేగించారు.

మడకశిర: పట్టణంలోని గాంధీ బజార్‌లో వెలసిన అతి పురాతనమైన బసవన్న గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ మహిళలు, లింగాయత్‌లు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



మాట్లాడుతున్న కోన ఆశ్రమం పీఠాధిపతి దత్తనందగిరి స్వామి

పావగడ: వీరశైవుల ఆరాధ్య దైవమైన బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో వైభవంగా జరిగాయి. శని మహాత్మ సర్కిల్ వద్ద స్థానిక బసవేశ్వర స్వామి భక్త మండలి ఆధ్వర్యంలో బసవేశ్వర స్వామి చిత్ర పటానికి పూజలు చేశారు. తాలూకా కార్యాలయంలో అధికారికంగా బసవ జయంతి వేడుకలు నిర్వహించారు.

పోస్టుమార్టం గది వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న మృతుడి బంధువులు

హిందూపురం: పరిగి చెరువు కట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాల రవాణా చేస్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీ కొనడంతో ఆటోడ్రైవర్ వెంకటేష్ (25) అక్కడిక్కడే మృతిచెందాడు. బొలెరో వాహన దారుడ్ని మృతుడి బంధువులు నిలదీయగా తాను వాహనంలోని లోడును అన్‌లోడ్ చేసి వస్తానని చెప్పి వెళ్లిపోయి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నాడు. శవాన్ని పరీక్షల నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పోస్టుమార్టం గది వద్ద తమకు న్యాయం చేయాలని బైఠాయించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ ఈరన్న అక్కడి చేరుకొని కేసు నమోదు చేసి చర్యలు చేపడతామని చెప్పడంతో వారు శవాన్ని తమ గ్రామానికి తీసుకెళ్లారు.

వివాహ పరిచయ వేదిక

పెనుకొండ: పట్టణంలోని షాదీ మహల్‌లో ఆదివారం వాల్మీకి, బోయ వివాహ పరిచయ వేదిక జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్నూలు నుంచి వాల్మీకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక అధ్యక్షుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్, జేడీఎస్ నుంచి బీజేపీలో చేరిక

పావగడ: స్థానిక బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్ సమక్షంలో అధిక సంఖ్యలో చిక్కజాలోడుకు చెందిన కాంగ్రెస్, జేడీఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో బీజేపీలోకి చేరారు. చిక్కజాలోడులో కృష్ణానాయక్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రొద్దం: మండల కేంద్రంలో భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు కురుబ కులస్తులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ అశ్వర్థ నారాయణ, ఉపాధ్యక్షుడు నారాయణప్ప, కోశాధికారి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునతో పాటు 12 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు అశ్వర్థనారాయణ తెలిపారు.

నూతన ఆలయ ప్రవేశం

అమరాపురం: మండలంలోని కాచికుంటలో నూతనంగా నిర్మించిన తిప్పేరుద్రస్వామి ఆలయంలోకి అర్చకులు వేద మంత్రాల మధ్య ప్రవేశం చేశారు. శాంతి, గణ, వాస్తు హోమాలను నిర్వహించారు. సోమవారం తిప్పేరుద్రస్వామి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్'

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని మునిమడుగు, గొల్లపల్లి, అడదాకులపల్లి, మావటూరు, గోనిపేట గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగింది. ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసలు, సర్పంచ్ అశ్వర్థ నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని తుమ్మలకుంట గ్రామ పరిసరాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,620 నగదు, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశామన్నారు.

అమరాపరం: మండల పరిధిలోని కాచికుంట గ్రామ పొలిమేరలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి 4 బైకులు, 8 సెల్‌ఫోన్లు, రూ.1,03,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

అమరాపురం: భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఆదివారం మండలంలోని వీరాపురం గ్రామంలోని దళిత కాలనీలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

ఇద్దరికి గాయాలు

అమరాపురం: మండలంలోని హాలుకూరుకు వెళ్లే రహదారిలో జాలి బావి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో శాంతరాజు, రాఘవేంద్ర అనే ఇద్దరికి గాయాలయ్యాయి. హాలుకూరు నుంచి అమరాపురానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు.

చిలమత్తూరులో వర్షం

చిలమత్తూరు: మండలంలో శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోగా ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.

ఘనంగా సామూహిక వివాహాలు

గుడిబండ: మండల పరిధిలోని పి.సి.గిరి గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త జయరామిరెడ్డి ఆధ్వర్యంలో పి.సి.గిరి గ్రామంలో ఆదివారం 18 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. జయరామిరెడ్డి పారిశ్రామిక వేత్తగా ఎదిరి బెంగళూరులో స్థిరపడ్డారు. పుట్టిన గ్రామానికి సేవచేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సం స్వగ్రామంలో సామూహిక వివాహాలు జరిపిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా 18 జంటలకు నూతన వస్త్రాలు, మంగళసూత్రం, కాలిమెట్లు అందజేశారు. అలాగే వివాహానికి వచ్చిన బంధు మిత్రులందరికీ ఉచిత భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచ్ జగదాంబ తదితరులు పాల్గొన్నారు.



సామూహిక వివాహాలు జరిపిస్తున్న దృశ్యం

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



50 ఏళ్ల తర్వాత కలసిన పూర్వ విద్యార్థులు

మడకశిర: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 1973 నుంచి 1980 మధ్య కాలంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన వారంతా ఒక చోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. 50 ఏళ్ల తర్వాత ఆదివారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో వారంతా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి రఘువీరతో పాటు రిటైర్డ్ జడ్జి శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తర్వాత అలనాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రఘునాథ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ నరసింహాస్వామి, సింగరేణి కాలరీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ప్రవేశ పరీక్షలు

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. 5వ తరగతికి సంబంధించి 413 మందికిగాను 360 మంది విద్యార్థులు హాజరయ్యారు. 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్‌కు సంబంధించి 127 మందికిగాను 107 మంది పరీక్ష రాశారు. 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలను ఈఓఆర్డీ శివన్న పరిశీలించారు.



దొమ్మరహట్టి గురుకుల పాఠశాలలో అర్హత పరీక్షను పర్యవేక్షిస్తున్న అధికారులు

రొళ్ల: దొమ్మరహట్టి సమీపంలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. ఐదో తరగతికి జరిగిన పరీక్షకు 332 మందికి గాను 306 మంది, ఇంటర్ ప్రవేశం కోసం 115 మందికిగాను 106 మంది పరీక్షకు హాజరయ్యారు.

జలకాలాటలలో...



నీటితొట్టెలో కేరింతలు కొడుతున్న చిన్నారులు



నీటిలోకి దూకుతున్న యువకుడు



యువకులు, పిల్లలతో కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్

హిందూపురం: రోజురోజుకూ పెరిగిపోతున్న ఉష్ణతాపానికి తాళలేక చల్లదనం కోసం యువకులు, చిన్నారులు జలకాలాటతో సేదతీరుతున్నారు. స్విమింగ్‌పూల్, నీటితొట్టెలు, చెరువుల వద్ద ఉత్సాహంగా ఈదులాడుతున్నారు. హిందూపురం ప్రాంతంలో మధ్యాహ్నం ఉష్ణోగ్రత 39 నుంచి 40 డిగ్రీల దాకా నమోదవుతోంది. దీంతో పిల్లలు, యువకులు పట్టణ శివారుల్లోని వ్యవసాయ తోటల వైపు పరుగులు తీస్తున్నారు. స్విమింగ్ పూల్స్ , తోటల్లో నిర్మించిన నీటితొట్టెల్లో కేరింతలు కొడుతున్నారు.

ఆర్బీకేలను తనిఖీ చేయాలి

హిందూపురం: రైతు భరోసా కేంద్రాలను విధిగా మండల ఏఓలు తరుచూ తనిఖీ చేసి అవసరమైన ఎరువులు, మందుల వినియోగాన్ని గుర్తించడంతో పాటు వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై చర్చించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఆదివారం హిందూపురం సహాయ వ్యవసాయ డివిజన్ కార్యాలయంలోఐదు మండలాల వ్యవసాయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.